క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

వెదురుకుప్పం: డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి సోమవారం మండలంలో పర్యటించ నున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ఆదివారం సాయంత్రం ఓ ప్రక టనలో తెలిపారు. వెదురుకుప్పం వెలుగు కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే వైఎస్సార్ ఆసరా కార్యక్రమా నికి హాజరై మహిళలకు మెగా చెక్కును అంద జేస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘ సభ్యులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు.

వైద్యసేవ దైవంతో సమానం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శ్రీరంగరాజుపురం: వైద్యసేవను అందించడం దైవంతో సమానమని సద్గురు సాయినాథ్ సేవా ట్రస్ట్ నిర్వాహకులు సరస్వతి అన్నారు. పుల్లూరు షిరిడీపురంలో సద్గురు సాయినాథ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 150 మంది వైద్యపరీక్షలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యదర్శి శేఖర్ రాజు, సభ్యులు కృష్ణకుమార్, మునివర్ధననాయుడు, దిలీప్‌రాజు, వినయ్ పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా సుదర్శన్


ఏ.సుదర్శన్

పుత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా ఎస్సీ సెల్ కమిటీని నియమించారు. జిల్లా జనరల్ సెక్రటరీగా నగరి నియోజకవర్గం పుత్తూరు మండలానికి చెందిన ఏ.సుదర్శన్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

పకడ్బందీగా కులగణన సర్వే


సింహరాజుపురంలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను పారదర్శకంగా చేయాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీకావేరిరాజుపురం సచివాలయ పరిధిలోని సింహరాజుపురంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ నిబంధనల మేరకు వివరాలు సేకరించి సర్వే చేస్తున్నారు. వలస వెళ్లిన కుటుంబాలకు ఓటీపీ ద్వారా సర్వే చేసి పూర్తిచేయాలని తెలిపారు. ఇప్పటివరకు సచివాలయ పరిధిలో 2,028 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకూ 1,895 కుటుంబాలకు సర్వే పూర్తి చేశామన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా చేనేత విభాగ కమిటీ అధ్యక్షులుగా ఈవీ కన్నాయిరం


ఈవీ కన్నాయిరం

నగరి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా చేనేత విభాగ కమిటీ అధ్యక్షులుగా నగరి మున్సిపాలిటీ సత్రవాడకు చెందిన ఈవీ కన్నాయిరం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. కన్నాయిరం మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు.


గో వృషభ కల్యాణం

పుత్తూరు: స్థానిక బజారు వీధిలోని ఆర్యవైశ్య సత్రంలో ఆదివారం గో వృషభ కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత వేద పండితులు కలశ ప్రతిష్ట చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గో మాతను పెళ్లి కూతురుగా, వృషభాన్ని పెళ్లి కొడుకుగా అలంకరించారు. పెళ్లికూతురు, పెళ్లికుమారుడు తరపున పీటల మీద రెండు కుటుంబాల వారు కూర్చొని శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. గోమాత మెడలో బంగారు తాళి బొట్టులతో మాంగల్యధారణ నిర్వహించారు. కల్యాణోత్సవం తర్వాత గోమాతకు, వృషభానికి కర్పూర హారతులిచ్చారు. గో వృషభ కల్యాణం నిర్వహించడం ద్వారా మానవాళి జీవనం సుఖమయమవుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం వివాహానికి విచ్చేసిన అతిథులకు స్వీట్లు పంచిపెట్టారు.


గోమాతకు మాంగల్యధారణ

కృష్ణారామాపురంలోని బస్‌షెల్టర్, కొత్త ఆరూరు వద్ద నిర్మించిన బస్‌షెల్టర్, పన్నూరు ఏపడబ్ల్యూ వద్ద నిర్మాణంలో ఉన్న బస్‌షెల్టర్





నిలువ నీడ.. ప్రయాణం సుగమం



ఏరియా ఆస్పత్రి వద్ద చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్మించిన బస్‌షెల్టర్

- పలు గ్రామాల్లో బస్ షెల్టర్ల నిర్మాణం
- దశాబ్దాల నాటి రోడ్డు సమస్యలకు పరిష్కారం
- గ్రామీణ ప్రాంతాలకు నూతన బస్సులు

నగరి : అభివృద్ధి అంటే అది కాగితాల్లో మ్యాజిక్ చేసి మభ్యపెట్టడం కాదని, ప్రజల అవసరాలను గుర్తించి బాధ్యతాయుతంగా అమలుపరచడమే అని ప్రస్తుత ప్రభుత్వం నిరూపిస్తోంది. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామీణ ప్రజలకు కావాల్సిన అవసరాలను, సదుపాయాలను సమకూర్చడంలోనూ తన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తోంది. ప్రజలకు అన్ని విధాలుగానూ సహకారం అందిస్తోంది. అలా ప్రయాణానికి సంబంధించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంలో భాగంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటుచేశారు. బస్సురాకకోసం ఎదురుచూస్తూ ఎండపట్టున, వానల్లో నిలవాల్సిన అవసరం లేకుండా చేశారు. నిశ్చింతగా బస్‌షెల్టర్‌లో కూర్చుని బస్సుకోసం వేచిచూసే సదుపాయాన్ని కల్పించారు. నగరి మండలంలోని బుగ్గ అగ్రహారం, కృష్ణారామాపురం, నింద్ర మండలంలోని నింద్ర, మేళంబాకం, ఎంఎస్‌వీఎం పురం, ఆరూరు గ్రామాల్లోను విజయపురం మండలంలోని పన్నూరు ఆదిఆంధ్రవాడ, మహరాజపురం, శ్రీహరిపురం, సీఎస్ కండ్రిగ గ్రామాల్లో ఎంపీ నిధులతోను, ఎంఎల్ఏ నిధులతోను బస్ షెల్టర్లు నిర్మించారు. నగరి ఏరియా ఆస్పత్రి వద్ద బస్సు కోసం వేచిచూసే ప్రయాణికుల కోసం తన చారిటబుల్ ట్రస్టు ద్వారా మంత్రి ఆర్కేరోజా బస్ షెల్టరు నిర్మించారు. మరో ఏడు బస్ షెల్టర్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి సహకారంతో దశాబ్దాలకు పైగా గత పాలకులు పట్టించుకోని రోడ్లకు మోక్షం వచ్చింది. నగరి ఏరియా ఆస్పత్రికి రోడ్డు వేయడంలోనూ, బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోడ్డు వేయడంలోనూ మంత్రి ప్రత్యేక చొరవ చూపారు. దీంతోపాటు గుండ్రాజుకుప్పం ఎస్టీ కాలనీకి రోడ్డు, కీళపట్టు నుంచి తమిళనాడు సరిహద్దు వరకు, విజయపురం మండలంలో జంబాడ–ఇళ్లత్తూరు, నగరి నాగలాపురం రోడ్డు నుంచి ఇరుగువాయికి రోడ్డు వేయడంలో మంత్రి తన సత్తాచాటుకున్నారు. పలు గ్రామీణ ప్రాంతాలకు పక్కా రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో బస్సుల్లేని పలు రూట్లకు మంత్రి ఆర్కేరోజా నూతన బస్సు సౌకర్యాలను కల్పించారు. బస్సులు లేని నగరి–ఏడుగట్లు, నింద్ర–ఒరురుపేట, పుత్తూరు–పిళ్లారిపట్టు, పుల్లూరు–దుర్గం, పుత్తూరు–పిళ్లారిపట్టు, నగరి–కరకంతాపురం గ్రామాల మధ్య నూతన సర్వీసులు నడిపించేలా చేశారు. ఇలా ప్రజలకు ప్రయాణ మార్గం సుగమం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బుగ్గ అగ్రహారం బస్‌షెల్టర్‌లో మంత్రి ఆర్కేరోజా (ఫైల్)


నూతన బస్సులో విద్యార్థులతో కలసి ప్రయాణిస్తున్న మంత్రి ఆర్కేరోజా


కీళపట్టు నుంచి తమిళనాడు సరిహద్దుకు వెళ్లే రోడ్డు

బస్‌షెల్టర్ ఎంతో ఉపయోగం



బుగ్గ అగ్రహారం ఆదిఆంధ్రవాడ వద్ద ప్రధాన రహదారిపై రూ.2.5 లక్షల నిధులతో బస్ షెల్టర్ నిర్మించారు. అది మా గ్రామం, అర్జునప్పనాయుడు కండ్రిగ గ్రామంతో కలిపి వంద కుటుంబాల వారికి ఉపయోగపడుతోంది. రోడ్డుపట్టున వెళ్లేవారు వర్షం వచ్చే సమయాల్లో తలదాచుకోవడానికి ఉపయోగపడుతోంది. ప్రధానంగా విద్యార్థులు నిశ్చింతగా బస్టాప్‌లలో నిరీక్షిస్తున్నారు.

– నిర్మల, బుగ్గఅగ్రహారం ఆదిఆంధ్రవాడ, నగరి మండలం

నిలువ నీడ దొరికింది



బస్ షెల్టర్ నిర్మాణంతో ప్రయానికులకు నిలువ నీడ దొరికింది. ఆరూరు నుంచి పలు ప్రాంతాలకు వెళ్లేవారు ఎండకు ఎండకుండా, వానకు తడవకుండా బస్ షెల్టర్‌లో సేదతీరుతున్నారు. ప్రయాణికులే కాకుండా బాటసారులు, అభాగ్యులు వర్షాలు, చలి సమయాల్లో బస్‌షెల్టర్‌లో తలదాచుకుంటున్నారు. గ్రామస్తులకు, విద్యార్థులకు, ప్రయాణికులకు ఈ బస్ షెల్టర్ బాగా ఉపయోగపడుతోంది.

– నవీన్, ఆరూరు, నింద్ర మండలం

ఇదివరకు ఇబ్బంది పడేవారం



రోడ్డంతా గుంతలమయం కావడంతో మా గ్రామానికి చేరుకోవడానికి చాలా ఇబ్బంది పడేవారం. ట్రాక్టర్లు, ఆటోలు నగరి పట్టణానికి రావాలంటే 40 నిమిషాలు పట్టేది. గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా అవస్థ పడేవాళ్లం. స్కూల్ వ్యాను సమయానికి వెళ్లాలన్నా కష్టమే. ప్రస్తుతం 15 నిమిషాల్లో నగరికి చేరుకుంటున్నాం. ప్రస్తుతం నూతనంగా తారు రోడ్డు వేయడంతో హాయిగా ప్రయాణిస్తున్నాం.

– మహేష్, టాక్సీ డ్రైవర్, ఓజి కుప్పం, నగరి మండలం

పేషెంట్ల కష్టాలు తీర్చిన షెల్టర్



ఏరియా ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలు, రోగులు మళ్లీ రోడ్డువద్దకు వెళ్లి బస్సు ఎక్కే సమయంలో చాలా ఇబ్బంది పడేవారు. వేసవి కాలంలోను, వర్షాకాలంలోను ఈ ఇబ్బందులు ఎక్కువగా ఉండేది. పేషంట్ల పరిస్థితి గమనించిన మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా బస్‌షెల్టర్ కట్టించారు. నేడు అది ఎందరికో నిరంతరం ఉపయోగపడుతోంది.

– గోవిందయ్య, ముడిపల్లి, నగరి మండలం

యువజన కార్యదర్శిగా నందకుమార్

- విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆవుల పవన్‌కుమార్


నందకుమార్


పవన్‌కుమార్

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలం ఆర్కేవీబీ పేటకు చెందిన మారుసాని నందకుమార్‌ను జిల్లా యువత విభాగం కార్యదర్శిగా నియమించినట్లు ఆయన తెలిపారు. నందకుమార్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషిచేసినందుకు గుర్తించి తమకు బాధ్యతలను అప్పగించారని చెప్పారు. తనకు బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రుణపడి ఉంటానని తెలిపారు.

విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆవుల పవన్‌కుమార్

జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా గంగాధర నెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం కేపీ అగ్రహారానికి చెందిన ఆవుల పవన్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు పదవిని అందించిన వైఎస్సార్‌సీపీపార్టీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి నేను రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యబోధనలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రజల్లోకి తీసుకెళ్లి జగనన్నను 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి అహర్నిశలు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం



నగరి : మండలంలోని దామరపాకం సచివాలయానికి ఆదివారం సిమెంటు రోడ్డును వేశారు. ప్రజలకు పాలనను చేరువ చేసేక్రమంలో దామరపాకం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ అంటూ సుమారు కోటి రూపాయల వ్యయంతో అన్ని భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఈ కార్యాలయాలకు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకోవడానికి సిమెంటు రోడ్డును రూ.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. గ్రామానికి ఇంతలా అభివృద్ధి పనులు చేస్తున్న ప్రభుత్వానికి, పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సమాజంలో మహోన్నతమైనది గురు స్థానం


సుదర్శన్‌రాజు దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: సమాజంలో మహోన్నతమైన స్థానం ఒక్క గురువులకు మాత్రమేనని, వారిని సమాజం ఎప్పుడూ గౌరవిస్తుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన సుదర్శనరాజు, భారతి దంపతులను డిప్యూటీ సీఎం పూలమాల వేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా గురు స్థానం చాలా ఉన్నతమైనదని కొనియాడారు. ఎంతో మందిని ఉన్నత స్థాయికి చేర్చే ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, దేవుడి కన్నా గొప్పవారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అభిమానంతో అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్న సుదర్శన్‌రాజు, ఇక పార్టీకి సేవలు అందించడానికి సహకరించాలని కోరారు. అనంతరం పాఠశాల హెచ్ఎం హేమారెడ్డి మంత్రిని శాలువతో ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన సుదర్శనరాజు దంపతులను తోటి ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు పాల్గొని ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, తుడా ప్లానింగ్ విశ్రాంతి అధికారి కృష్ణారెడ్డి, సర్పంచ్ ధనంజయవర్మ, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, చందురాజు, ధనశేఖర్‌వర్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణయాదవ్, పట్టాభిరెడ్డి, చలపతిరావు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డీడీఓ కుమార్

వెదురుకుప్పం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీడీఓ కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని తిప్పినాయుడుపల్లెలో భారత్ వికసిత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో పేదలు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. పథకాలు అందకుంటే కారణాలను తెలుసుకుని లబ్ధిపొందేందుకు చొరవ చూపాలన్నారు. ఈఓపీఆర్డీ పురుషోత్తం, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఐకమత్యంతో సంఘాన్ని బలపరుద్దాం

చిత్తూరు రూరల్: ఐకమత్యంతో ఈడిగ సంఘాన్ని బలపరుచుకుందామని ఈడిగ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. చిత్తూరు నగరం కట్టమంచి శివాలయ ఆవరణలో ఆదివారం సంఘ సమావేశం, మహోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఈడిగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, వినోద్‌కుమార్ సభ్యులతో కలిసి ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అందరికీ క్యాలెండర్ పంపిణీ చేసి, ప్రసంగించారు. అగ్రవర్ణాలకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్న ఈడిగ, కులస్తులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాధికారం కోసం ఈడిగ కులస్తులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సౌరవిద్యుత్‌ను ప్రోత్సహించాలి

చిత్తూరు రూరల్: వ్యవసాయ రంగంలో సోలార్ సిస్టం (సౌర విధానం) ద్వారా విద్యుత్‌ను రైతులకు ప్రభుత్వం అందించేలా ప్రోత్సాహం అందించాలని రైతు సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సంఘ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ వాడకం రాష్ట్రంలో మరింతగా పెరుగుతోందన్నారు. వ్యవసాయ రంగంలో విద్యుత్ తప్పనిసరి కావడంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడిని పెంచుకోవడానికి ప్రభుత్వం వ్యవసాయ రంగంలో సోలార్ సిస్టంను తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా విద్యుత్‌కు చెల్లించే ఖర్చు తగ్గించడంతోపాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం సోలార్ సిస్టంపై దృష్టి పెట్టాలని కోరారు.

అంగన్‌వాడీలో సంపూర్ణ ఆరోగ్యం

- వైఎస్సార్ సంపూర్ణ పోషకాలతో గర్భిణి, బాలింతలకు ఆసరా
- చిన్నారులకు పౌష్టికాహారం
- అందరికీ అందేలా నిరంతర పర్యవేక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


పౌష్టికాహారం వాడకంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మసునంద


కిట్లను గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న దృశ్యం

కార్వేటినగరం: తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని వారికి అందిస్తున్నాయి. వైఎస్సార్ సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించి ఆరోగ్యవంతులుగా మారుతున్నారు. చిన్నారులకు కూడా క్రమం తప్పకుండా మంచి ఆహారం అందించడంతో పౌష్టికాహార లోపం నుంచి బయటపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలకు వచ్చే ఆహారం దుర్వినియోగమయ్యేది. చిన్నారులకు కోడిగుడ్లు సక్రమంగా అందే పరిస్థితి ఉండేది కాదు. టీడీపీ హయాంలో ఉన్న విధానాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలని, సంపూర్ణ పౌష్టికాహారం అందించాలని, ఎక్కడైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు పూర్తిగా మారిపోయింది.

నియోజకవర్గ పరిస్థితి

నియోజక వర్గంలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. కార్వేటినగరం, గంగాధరనెల్లూరు. వీటి పరిధిలో 298 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 16,110 మంది చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. వీరిలో ఎదుగుదల, రక్తహీనత, బరువు తక్కువ ఉన్నవారికి, ఎత్తుకు తగ్గ బరువు, వయస్సుకు తగ్గ ఎత్తు ఉండే వారికోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇక బాలింతలు 6,982 మంది, గర్భిణులు 8,972 మంది నమోదై ఉన్నారు. చిన్నారులకు బాలామృతం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, చిక్కీలు, రాగి పిండి, ఎండు ఖర్జూరం, జొన్నపిండి, అటుకులు వంటి బలవర్ధకమైన ఆహారపదార్థాలు ఇవ్వడం ద్వారా రక్తహీనతను అధిగమించేలా సాయపడుతున్నారు.

నిరంతర పర్యవేక్షణ..



ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. ఇంటి వద్దకే కిట్ల పంపిణీ బాగుంది. గర్భవతి అయిన వెంటనే సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని వారే వచ్చి పేరు, నమోదు చేసుకున్నారు. నా ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తూ సూచనలు ఇస్తున్నారు.

– లావణ్య, గర్భిణి, కార్వేటినగరం.

ఆడపడుచులకు అండగా ..



ఆడపడుచులకు అండగా సీఎం జగనన్న ఉంటున్నారు. ప్రస్తుతం కిట్ల రూపంలో ఇస్తున్న పౌష్టికాహారం చాలా బాగుంది. దీనిని తీసుకుంటూ ఉంటే రక్తహీనత సమస్య తగ్గుతుంది. ఈ కిట్లు ఇంటికి వచ్చి అందిస్తున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యానికి జగనన్న ప్రభుత్వం అత్యధికంగా ప్రాధాన్యత ఇస్తోంది. మాకూ సంతోషంగా ఉంది.

– ఉషారాణి, బాలింత, కార్వేటినగరం.

పారదర్శకంగా అందిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. గతంలో బరువు తక్కువ ఉన్న చిన్నారులకు మాత్రమే కోడిగుడ్లు ఇచ్చేవాళ్లం. ప్రస్తుతం అందరికీ పంపిణీ చేస్తున్నాం. పది రకాల సరుకులున్న కిట్లను బాలింతలకు, గర్భిణులకు ఇంటికి తీసుకెళ్లి ఇస్తున్నారు.

– పద్మ సునంద, ఐసీడీఎస్ సీడీపీఓ, కార్వేటినగరం

కబడ్డీ విజేత గంగాధరనెల్లూరు


గంగాధరనెల్లూరు జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గంగాధరనెల్లూరు మండలం జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం లైన్‌బాయ్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. గంగాధరనెల్లూరు మండలం లక్ష్మిరెడ్డిపల్లె జట్టు ప్రథమ స్థానం, బంగారుపాళెం మండలం ముంగరమడుగు జట్టు ద్వితీయ స్థానం, నల్లంగాడుకోటూరు జట్టు మూడోస్థానం, తగ్గువారిపల్లె జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు రూ.2000, 1000, 500, 250 నగదు బహుమతులను అందజేశారు. గ్రామీణ క్రీడైన కబడ్డీని ప్రోత్సహించే ఉద్దేశంతో పోటీలను నిర్వహించినట్లు దావుద్, బబ్లూ తెలిపారు.